కాంగ్రెస్‌వన్నీ 420 హామీలు

- జోగిపేటలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం
- ఎంపీ ఎన్నికల్లో గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఇచ్చిన హామీలు అమలు చేయడం కాంగ్రెస్‌కు సాధ్యం కాదు
- వారి వైఫల్యాలను ప్రజలకు వివరిస్తే మనదే విజయం
- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

అందోల్, మార్చి 29: కాంగ్రెస్ పార్టీవన్నీ 420 హామీలేనని, ఈ విషయాన్ని ప్రజలకు వివరిస్తూ లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ గడ్డపై గులాబీ జెండాను ఎగురవేయాలని శాసనసభ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అధ్యక్షతన జోగిపేటలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీస్పీకర్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి మోసపోయామని ప్రజలు గుర్తించారన్నారు. పదేండ్లలో రాష్ట్రంలో ఎప్పుడూ కరువు అనే మాటే వినపడలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడ చూసినా కరువు తాండవం చేస్తున్నదన్నారు. కరెంట్ సరిగా ఉండక, గ్రామాల్లో తాగునీరు దొరకక రైతులు, మహిళల బాధలు వర్ణణాతీతం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలంటే రూ.మూడు లక్షల కోట్లు కావాలని, రాష్ట్ర బడ్జెట్ కూడా అంతలేదన్నారు. ఇచ్చిన హామీలు ఎలా తీరుస్తారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. అమలుకు సాధ్యం కానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చినా అవి తీర్చడం కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల కాదన్నారు. కాంగ్రెస్, బీజేపీల నుంచి ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు గతంలో ఎంపీలుగా చేసిన వారేనని వారు ఎంపీలుగా ఉన్నప్పుడూ జహీరాబాద్ అభివృద్ధికి ఎం చేశారో చెప్పాలన్నారు. ముక్కుమోహం తెలియని వ్యక్తిని తీసుకొచ్చి కేసీఆర్ ఎంపీగా నిలబెడితే, జహీరాబాద్ కార్యకర్తలు బుజాన మోసి రెండుసార్లు ఎంపీని చేస్తే స్వంత వ్యాపారాల కోసం పార్టీ మారి ప్రజలను, పార్టీ శ్రేణులను మోసం చేశాడని, అలాంటి మోసకారిని ఇంటికి పంపాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌కుమార్ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నాడని, ఎన్నో ఉద్యమాలు చేశాడని ఆయన గెలిస్తే జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేస్తాడాన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

బీఆర్ఎస్ నుంచి పోయేదంతా చెత్త సరుకే..

బీఆర్ఎస్ నుంచి పోయేదంతా చెత్త సరుకేనని, బీఆర్ఎస్‌కు గ్రామస్థాయి నుంచి ఉద్యమకారులు, పటిష్టమైన క్యాడర్ ఉన్నదని వాళ్లే కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటారని పార్లమెంట్ ఎన్నికల తర్వాత మళ్లీ సత్తా చూపుతామన్నారు. పార్టీని వీడి వెళ్లేవారిని పట్టించుకోకుండా మన నాయకుడు కేసీఆర్ మనకు నిర్దేశించిన గమ్యాన్ని చేరుకునేందుకు అందరం కష్టపడి మన బీఆర్ఎస్ ఎంపీని గెలిపించుకోవాలన్నారు. ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ స్థానికుడని, గత ఎంపీ లాగా తెలుగు రానీవాడు కాదని, ఏ క్షణంలో ఫోన్ చేసినా స్పందిస్తాడని అలాంటి వ్యక్తి పార్లమెంట్‌లో ఉంటే మనకు మరింత అండగా ఉంటుందన్నారు.

మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి

అభివాదం చేస్తున్న మాజీ స్పీకర్, జడ్పీ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి, ఇతర నాయకులు

జహీరాబాద్ గడ్డపై గులాబీ జెండాను ఎగురవేయాలి

ఎంపీ ఎన్నికల్లో జహీరాబాద్ గడ్డపై గులాబీ జెండాను ఎగురవేయాలని జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజల్లో ఉంటూ కాంగ్రెస్ మోసపూరిత మాటలు, అమలుచేయని హామీలను వివరించాలన్నారు. కేసీఆర్‌ను దూరం చేసుకొని తప్పుచేశామని బాధపడుతున్న వారికి అండగా నిలబడి ఎంపీ అభ్యర్థికి ఓటు వేసేలా చూడాలన్నారు. ఒకరిద్దరు పార్టీ మారినంత మాత్రనా...బీఆర్ఎస్‌కు నష్టంలేదని, పార్టీకి కార్యకర్తలే ముఖ్యమన్నారు. రానున్న రోజుల్లో ప్రతి కార్యకర్తకూ సముచిత స్థానం ఉంటుందన్నారు. ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు ఒక్కసారి తనకు ఎంపీగా అవకాశం కలిస్తే జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తానన్నారు. కేసీఆర్ ఎంతో నమ్మకంతో తనకు టికెట్ ఇచ్చాడని ప్రజలు, పార్టీ శ్రేణులు తనను ఆదరిస్తే మీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూరన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలయ్య, జడ్పీటీసీ రమేశ్, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణాగౌడ్, మాజీ ఎంపీపీ రామాగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్లు సంజీవయ్య, నాగభూషణం, రజినీకాంత్, రాహుల్‌కిరణ్, శ్రీధర్, వెంకటేశం పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు హాజరైన మంత్రి

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మండలపరిధిలోని మొగ్దుంపల్లిలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రసూల్‌పటేల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు లో వైద్యారోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. మంత్రికి ముస్లింలకు శుభాకాంక్షలు తెలపడంతోపాటు శాలువా, పూలమాలతో సన్మానం చేశారు. మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

-మునిపల్లి, మార్చి 29

ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి

ఇఫ్తార్ విందులో పండు తినిపిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎంపీ అభ్యర్థి గాలిఅనిల్‌కుమార్

కోహీర్, మార్చి29: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని జహీరాబాద్ పట్టణంలో శుక్రవారం రాష్ట్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తన్వీర్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తదితర నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ తన్వీర్‌కు పండు తినిపించి రంజాన్ ఉపవాస దీక్షను విరమింపజేశారు. మంకాల్ సుభాశ్, గుండప్ప, నారాయణ, రామకృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

కోహీర్-కవేలి ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

వాహన తనిఖీలు

కోహీర్, మార్చి 29: మండలంలోని కవేలి ప్రధాన రహదారిపై శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు అక్రమ రవాణాను అరికట్టేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఆధ్వర్యంలో వాహనాల్లో సోదాలు నిర్వహించారు. కోహీర్-కవేలి రహదారిపై వెళ్లే వాహనాలను నిశితంగా పరిశీలించారు. మండలంలోని మనియార్‌పల్లి, సిద్ధాపూర్ తండా గ్రామ శివారులో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

బొంతపల్లి పారిశ్రామికవాడలో కరపత్రాలు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గుమ్మడిదల, మార్చి 29: పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ నియోజకవర్గ నాయకుడు రవి కోరారు. శుక్రవారం మండలంలోని బొంతపల్లి, దోమడుగు పారిశ్రామికవాడలోని వివిధ పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తున్న దినసరి కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని పరిశ్రమల యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. 73 షెడ్యూల్డ్ ప్రకారం పరిశ్రమల్లో కనీస వేతనాల జీవోలను పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించాలని కోరారు. పారిశ్రామిక ప్రాంతంలోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులను కలిసి కరపత్రాలు అందజేశారు. వీరితో పాటు నాయకులు నర్సింహగౌడ్, హుస్సేన్, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆదినారాయణస్వామి ఆలయంలో జడ్జి పూజలు

జడ్జి ప్రభాకర్‌రావుకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

జిన్నారం, మార్చి 29 : సుప్రసిద్ధ క్షేత్రమైన కొడకంచి ఆదినారాయణ స్వామి ఆలయాన్ని జడ్జి ప్రభాకర్‌రావు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో జడ్జికి స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం జడ్జిని ఆలయ ట్రస్టీ ఫౌండర్ రామాజీరావు శాలువాతో సన్మానించారు. ఆలయ ప్రాంగణం, కోనేరు, గాలిగోపురంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలను జడ్జి పరిశీలించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను రామాజీరావు జడ్జికి వివరించారు. ఆయన వెంట ఎస్సై విజయరావు, మాజీ సర్పంచ్‌లు శెట్టి శివరాజ్, శ్రీశైలం యాదవ్, భాస్కర్ తదితరులున్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

లింగంపల్లి గురుకుల పాఠశాలలో అదనపు గదుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎల్‌అండ్‌టీఎల్ రీజినల్ హెడ్ వినోశ్ కుమార్

మునిపల్లి, మార్చి 29: గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎల్‌అండ్‌టీఎల్ రీజినల్ హెడ్ వినోశ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాలలో ఎల్‌అండ్‌టీఎల్ ఆధ్వర్యంలో డెక్కన్ టోల్‌ప్లాజా సహకారంతో ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్‌అండ్‌టీఎల్ రీజినల్ హెడ్ వినోశ్‌కుమార్ మాట్లాడుతూ లింగంపల్లి గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల కోసం అనేక కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. గురుకుల పాఠశాలలో రూ. 85 లక్షలతో అదనపు తరగతులు, రూ.కోటి తో విద్యార్థులకు బెడ్లు అందజేసినట్లు తెలిపారు. లింగంపల్లి గురుకుల పాఠశాల అభివృద్ధి కోసం ఎల్‌అండ్‌టీఎల్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజేశ్ విచారే, సిబ్బంది శ్రీనివాస్ రావు, కోటేశ్వర్‌రావు, విజేందర్‌రెడ్డి, సోమనాథ్ శాస్త్రి, విద్యాసాగర్, నాగరాజు, గురుమూర్తి, ప్రిన్సిపాల్ చైతన్య ఉన్నారు.

కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

అమీన్‌పూర్, మార్చి 29: మున్సిపాలిటీ పరిధిలోని బంధంకొమ్ము చెరువు రోజురోజుకూ కబ్జాకు గురవుతున్నదని అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జనం కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బంధంకొమ్ము చెరువును పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ బంధంకొమ్ము చెరువులో అక్రమార్కులు నిత్యం మట్టితో పూడ్చి ఆక్రమణలకు పాల్పడుతున్నారన్నారు. అధికారులు చెరువును సర్వే చేయించి కబ్జాకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకోవాలని ఈ సం దర్భంగా డిమాండ్ చేశారు.

నేడు అమీన్‌పూర్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ నిలిపివేత

అమీన్‌పూర్, మార్చి 29: అమీన్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం 33 కేవీ సబ్‌స్టేషన్‌లోని 11 కేవీ ఫీడర్‌లో అత్యవసర పనుల నిమిత్తం పలు చానల్స్‌కు 30 నిమిషాలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామనిని ఏఈ వెంకట్రామ్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. బంధంకొమ్ము ఫీడర్‌చానల్‌లో సాయంత్రం 6:30 గంటల నుంచి 7 గంటల వరకు ఆర్ఆర్‌హోమ్స్ ఫీడర్ చానల్‌లో 7:30 నుంచి 8 గంటల వరకు, అమీన్‌పూర్ ఫీడర్ చానల్‌కు 8 గంటల నుంచి 8:30 వరకు, వెదిరి ఫీడర్ చానల్‌లో 8 గంటల నుంచి 9 వరకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

కామునిచెరువులో పూడికతీత పనులు

కల్హేర్, మార్చి 29: కల్హేర్ శివారులోని కాముని చెరువులో పూడికతీత పనులు కొనసాగుతున్నాయని, మట్టిని రైతులు పొలాల్లో వేసుకోవచ్చని ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ రఘువీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తి గల రైతులు ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకుంటే ఉపాధి కూలీలు మట్టిని ట్రాక్టర్‌లో నింపుతారన్నారు. మట్టిని పొలాల్లో వేసుకోవడంతో భూమి సారవంతమవుతుందన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

జిన్నారం, మార్చి 29: మండలంలోని సోలక్‌పల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై విజయరావు కథనం ప్రకారం.. సోలక్‌పల్లి గ్రామానికి చెందిన సిరిగిరి గండయ్య(55) ఈనెల 26వ తేదీ మంగళవారం రాత్రి తన తల్లి సిరిగిరి రాజ మ్మ ఇంటికెళ్లి పడుకున్నాడు. బుధవారం ఉదయం నిద్రలేచే సరికి కుమారుడు కనిపించకపోవడంతో చుట్టుపక్కల గ్రామం లో వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి రాజ మ్మ అదేరోజు జిన్నారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమో దు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. శుక్రవారం గ్రామ శివారులోని జేసీబీతో తీసిన గుంతల వద్ద బోర్లపడి అనుమానాస్పద స్థితిలో గండయ్య మృతి చెందాడు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

జహీరాబాద్ మెథడిస్ట్ సెంట్రల్ చర్చిలో నిర్వహించిన గుడ్ ఫ్రైడేలో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

రాయికోడ్ మెథడిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

న్యాల్‌కల్ : రేజింతల్ గ్రామ శివారులోని బేతేస్థ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఘనంగా గుడ్‌ఫ్రైడే

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు గుడ్‌ఫ్రైడ్‌ను ఘనంగా నిర్వహించుకున్నారు. శుక్రవారం చర్చిల్లో క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు, ఫాదర్లు కీస్తు చరిత్ర, బోధనలు వినిపించారు. ఏసుప్రభువు చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. అనంతరం ఏసయ్యను స్మరిసూ, క్రీస్తుకు సంబంధించిన భక్తిగీతాలు ఆలపించారు.

- సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, మార్చి 29

నేడు 'ఖేడ్'లో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

నారాయణఖేడ్, మార్చి 29: నారాయణఖేడ్‌లోని కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు మాజీఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి, జహీరాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ హాజరు కానున్నారని చెప్పారు. సమావేశానికి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ముఖ్యనేతలు, పార్టీ అనుబంధ సంఘాల బాధ్యులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

పాముకాటుతో రైతు మృతి

హత్నూర, మార్చి 29: పాముకాటుతో రైతు మృతి చెందిన ఘటన హత్నూర మండలం సికింద్లాపూర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి మల్లేశం (32) గురువారం వరి పొలానికి నీరుపెట్టేందుకు వెళ్లగా పాముకాటుకు గురయ్యాడు. దీంతో చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య శైలజ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

యాచకుడికి అంత్యక్రియలు

యాచకుడి మృతదేహాన్ని ఖననం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

బొల్లారం, మార్చి 29: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోనీ బీసీకాలనీలో నివసించే నిజామాబాద్ జిల్లాకు చెందిన యాచకుడు రవి(40) శుక్రవారం చనిపోయాడు. మృతుడికి వయోభారంతో ఉన్న అక్క కూడా ఉన్నది. వారి దయనీయ పరిస్థితిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ గంగాధర్ మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేశారు.కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో యాచకుడి మృతదేహాన్ని వైకుంఠ రథంలో తీసుకెళ్లి పారిశుధ్య సిబ్బందితో మానవీయ కోణంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం విజయలక్ష్మి, కాలనీవాసులు సత్యనారాయణ, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

దాడులు చేస్తే ఊరుకోం

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 29: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ గూండాలు చేస్తున్న దాడులను చూస్తూ ఊరుకోబోమని, చర్యకు ప్రతిచర్య ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హెచ్చరించారు. నారాయణఖేడ్ మండలం బాణాపూర్ మాజీసర్పంచ్ కవిత భర్త చన్‌బసప్పపై కాంగ్రెస్ నాయకులు దాడిచేయడంతో కాలికి బలమైన గాయమై దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఆయనను పరామర్శించి మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. రాజకీయంగా ఎదుర్కోవడం చేతకాని కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారన్నారు. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి క్రమశిక్షణతో బీఆర్ఎస్ కార్యకర్తలు సంయమనంతో ఉన్నారని, కాంగ్రెస్ నాయకులు తమ పద్ధతి మార్చుకోకపోతే ప్రతిదాడులకు దిగాల్సి వస్తుందన్నారు. చన్‌బసప్పపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

సంగారెడ్డి సర్కార్ దవాఖానలో డీఎంహెచ్‌వోతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, మార్చి 29: మండలంలోని కృష్ణాపూర్ మాజీసర్పంచ్ అత్తమ్మను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. సంగారెడ్డిలోని సర్కార్ దవాఖానలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌వోతో ఆమె ఆరోగ్యంపై చర్చించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆయన వెంట శ్రేయారెడ్డి ఉన్నారు.